కథ

**అలారం చప్పుడికి ఉలిక్కిపడి లేచాను. అప్పుడే అయిదయిపోయిందా అనుకుంటూ ఎదురుగా ఉన్న దేవుని పటానికి నమస్కరించి, అలవాటుగా పక్కకి తిరిగి ఆయన్ని, పిల్లల్ని చూసుకుని మంచం దిగాను. గబగబా బ్రెష్ చేసుకుని పాల బూత్‌కి బయలుదేరాను.**

# ఇదేమి వింత అనుబంధమో?

తాడిమేటి శ్రీదేవి

ఏడున్నరకల్లా ఆయన్ని ఆఫీస్‌కి, ఎనిమిదిన్నరకి పిల్లల్ని స్కూలుకి సాగనంపాలి. ప్రొద్దున్న అయిదు మొదలు తొమ్మిది వరకు నాకు కసరత్తు కమ్ అష్టావధానం తప్పదు. పాల పాకెట్‌లు బాస్కెట్‌లో పడేసుకుని గబగబా అడుగులు వేస్తున్నాను.

ఇంకా చీకట్లు పూర్తిగా తొలగలేదు. వీధి మలుపు దగ్గర మూటలా ఒక ఆకారం. మూలుగు వినబడుతోంది. దగ్గరికి వెళ్లి చూశాను. ఎవరో ముసలావిడ డెబ్భై ఏళ్లు దాటే ఉండచ్చు. ఒంటి మీద చెయ్యి వేసి చూశాను. వేడిగా తగిలింది.

కట్టుకున్న బట్టలు కొంచెం ఖరీదైనవిగానే ఉన్నాయి. ఎవరో బతికి చెడ్డ మనిషిలా ఉంది. నెమ్మదిగా తట్టి పిల్చాను "ఏవండీ" అంటూ. ఒక్కసారి కళ్లు విప్పి చూసి తిరిగి మూసింది. ఆవిడ లేచే పరిస్థితిలో అస్సలు లేదు. నాకేమో వదిలి వెళ్లడానికి మనసొప్పడం లేదు.

ఇంతలో పాల పాకెట్లు పంపకం అయిపోయి అటుగా వస్తున్న నర్సింలు కనబడ్డాడు. "నర్సింలూ" ఆత్రంగా పిలిచాను.

"ఏంటమ్మా?" అంటూ వచ్చాడు.

"ఈవిడెవరో చూడు నర్సింలూ? ఏమయ్యిందో పాపం ఇలా పడి ఉంది. కాస్త సాయం పడతావా మా ఇంటి దాకా?" అడిగాను.

"సాయం పట్టేటందుకేమయ్యిందమ్మా. దూది మూటలా ఉంది. నేనే దింపుతాను" రెండు చేతులతో ఎత్తుకుని బయలుదేరాడు.

నేను గబగబా ముందు నడిచి మడత.మంచం వాల్చి ఉంచాను. మంచం మీద దింపేసి "వస్తానమ్మా" అని, "యాడిదో ఈ ముసల్ది పాపం!" అనుకుంటూ వెళ్లిపోయాడు.

గబగబా పాలు కాచి కొంచెం హార్లిక్స్ కలిపి స్పూన్‌తో వేడివేడిగా తాగించాను. సగం గ్లాసు తాగేసరికి కొంచెం ఓపిక వచ్చినట్లుంది. కళ్లు తెరిచి నా వైపు చూస్తూ మిగిలిన పాలు తాగింది.

బెడ్‌రూమ్‌లో అలికిడి అయింది ఆయన లేచినట్లు. ఈవిడ గురించి ఏం చెప్పాలా అని అటువేపు చూస్తూ ఆలోచిస్తున్న నేను "థాంక్యూ మై చైల్డ్" అన్న మాట విని తెల్లబోయాను. అది ఆ ముసలావిడ నోటి లోంచి వచ్చిన మాటేనని నా మెదడు అంగీకరించడానికి కొంచెం టైమ్ కావాల్సి వచ్చింది. 'ఈమెకి తెలుగు రాదా ఎక్కడావిడ నలు' ఆశ్చర్యం.

"యూ ఆర్ ఫ్రమ్.." అంటూ ఆగాను.

"ఐయామ్ ఫ్రమ్ పూనే" చక్కటి ఉచ్చారణతో జవాబిచ్చిందావిడ. ఆవిడ మాట్లాడే విధానం చూస్తుంటే ఇంగ్లీష్ మాట్లాడడం బాగా అలవాటయిన దానిలా ఉంది.

"ఏంటోయ్ ఎవరితో మాట్లాడుతున్నావ్?" అంటూ వచ్చారాయన.

"లేచారా? బ్రష్ చేసుకున్నారా?" అంటూ లోపలికి నడిచాను. నా ఆంతర్యం గ్రహించిన ఆయన లోపలకి వచ్చారు. నేను చెప్పినదంతా విని ఆయన కూడా తెల్లబోయారు. "పూనే నుంచి వచ్చిందా ఆవిడ. ఇంగ్లీష్ బాగా మాట్లాడుతోందా? ఇక్కడి వరకు ఎలా వచ్చిందసలు. రోడ్డు మీద పడి ఉండటం ఏమిటి?" అంటూ ఆవిడ దగ్గరకు నడిచారు.

కాస్త కడుపులో వేడివేడి పాలు పడేసరికి మగత కమ్మినట్లుంది. నిద్ర పట్టేసిందావిడకి. సర్లే లేపడమెందుకని మేము కూడా రొటీన్‌లో పడ్డాం.

పిల్లలు లేచిన వెంటనే "ఎవరమ్మా అక్కడ?" ఎంక్వైరీ మొదలు పెట్టారు. వాళ్లు వేసే యక్ష ప్రశ్నలకి జవాబు చెప్పడం కష్టమని నాకు పెద్దమ్మ వరసవుతుంది దూరపు చుట్టమని చెప్పాను.

"అయితే మాకేమవుతుంది. మేమేమని పిలవాలి?" బాబిగాడి ధర్మ సందేహం.

"అమ్మకి పెద్దమ్మ అయితే మనకి పెద్దమ్మమ్మ" పెద్ద సిసింద్రీ వివరణ.

"అవునవును మీరు త్వరగా తెమిలిపోవాలి. స్కూల్ బస్ వెళ్లిపోతే మళ్లీ కష్టం" తరిమాను.

స్కూలుకి రెడీ అవుతూనే నాలుగైదుసార్లు ఆవిడ మంచం దగ్గరకి వెళ్లి ఆవిడ్ని పరిశీలనగా చూడడం గమనించి నవ్వుకున్నాను.

"అమ్మా మేము స్కూలు నుంచి వచ్చేసరికి ఉంటుందిగా పెద్దమ్మమ్మ?" అని అడిగి ఉంటుందని ఖరారు చేసుకునిగానీ వాళ్లు బయల్దేరలేదు.

"ఏంటోయ్ మీ పెద్దమ్మ సంగతేంటి?" పిల్లలకి అలా చెప్పడం విన్నట్లున్నారు ఆయన.

"పాపం పడుకుందిగా లేవనియ్యండి. నెమ్మదిగా కనుక్కుంటాను. ఆ మాత్రం ఒక్కరోజు చూడలేమా?" అన్నాను.

"సరే సరే నీకు కష్టం లేకపోతే నాకేం బాధ. కానీ త్వరగా కనుక్కుని ఆవిడని వాళ్ల వాళ్లకి అప్పజెప్తే నయం"

తొమ్మిదింటికి నా పనయిపోయాక ఆవిడ్ని లేపి కూర్చోబెట్టి, మొహం కడిగించి, రెండిడ్లీలు తినిపించాను. వణికిపోతున్న చేతులతో ఇడ్లీ ముక్కలు నోట్లో పెట్టుకుంటున్న ఆమెను చూస్తుంటే నా గుండె నీరయ్యింది.

నేను పనమ్మాయితో మాట్లాడ్డం విన్న ఆవిడ "మీరు తెలుగువారా?" అని అడిగింది.

"అవును మీకు తెలుగు వచ్చా?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఇదే వూరు?" ఆవిడ ప్రశ్న.

"హైదరాబాద్" నా జవాబు, ఇదే ఊరో కూడా తెలియకుండా ఈవిడ ఇక్కడికి ఎలా వచ్చిందబ్బా అనుకుంటూ.


"ఆ!!" ఆవిడ కళ్లలో ఆశ్చర్యం. మరుక్షణం బాధతో ఆవిడ మొహం ముడుచుకుపోయింది. కళ్లల్లో నీటిపొర కదలాడింది. జీవం కోల్పోయి గాజుగోళీల్లా ఉన్న ఆమె కళ్లు ఆ తడికి మెరిశాయి. నాకైతే ఆవిడ పెద్ద పజిల్‌లా అనిపించింది.

ఆవిడ వివరాలు తెలుసుకోవాలని తొందర పెడుతున్న మనసును నిలువరిస్తూ పనమ్మాయి సాయంతో ఆవిడ స్నానానికి ఏర్పాటు చేశాను. బట్టలేమైనా ఇద్దామంటే ఆవిడ వారించి తన దగ్గరున్న బ్యాగ్ చూపించింది. బ్యాగ్ కొంచెం పాత బడినా ఖరీదయినదే. అందులో బట్టలు కూడా బావున్నాయి.

స్నానం చేసి ఆవిడ కాసేపు ప్రశాంతంగా ధ్యానం చేస్తున్నట్లు కూర్చున్నారు. నేను పక్కనే కుర్చీలో కూర్చుని పేపర్ తిరగేస్తూ ఆవిడనే గమనిస్తున్నాను. ఆవిడ పద్ధతులన్నీ చాలా సిస్టమేటిగ్గా, ఎప్పటి నుంచో అలవాటుగా చేస్తున్నట్లు ఉన్నాయి.

ఆవిడ కళ్లు తెరవగానే ఇంక ఉండబట్టలేక "మీరెవరు? ఇక్కడికి ఎలా వచ్చారు?" ప్రశ్నించాను.

ఆవిడ ఒక్కసారి గొంతు సవరించుకుని మొదలుపెట్టింది.




"మాది ఒకప్పుడు ఆంధ్రానే. నా పదహారో యేట నాకు మా అత్త కొడుకుతో పెళ్లయి నేను ఢిల్లీ వెళ్లిపోయాను. ఢిల్లీ వాసం వలన హిందీ బాగా వంటబట్టింది. పిల్లలు పుట్టాక వాళ్లని బాగా చదివించుకోవాలనే కాంక్షతో ఇంగ్లీష్ పట్టుదలగా నేర్చుకున్నాను. స్పీకింగ్ కోర్సులు చేయకపోయినా పంతం పట్టి ఫ్లూయెన్సీ పెంచుకున్నాను. పిల్లల గురించి నేనూ, ఆయనా తపించని క్షణం అంటూ ఉండేది కాదు. కానీ...'' ఆగిపోయింది. కన్నీళ్లు ముత్యాల్లా రాలి పడుతున్నాయి.

"కాసేపు రెస్ట్‌గా పడుకోండి. ఇప్పుడేం చెప్పొద్దు'' వారించాను. "ఇట్సాల్‌రైట్ మరేం ఫరవాలేదు'' అంటూ కొంచెం మంచినీళ్లు కావాలని సైగ చేసింది. నీళ్లు తాగాక మళ్లీ చెప్పడం మొదలుపెట్టింది.

"పదేళ్ల క్రితం ఆయన పోయారు. అప్పటి నుంచీ కొన్నాళ్లు పెద్ద వాడి దగ్గర పూనాలోను, కొన్నాళ్లు చిన్నవాడి దగ్గర త్రివేండ్రంలోను ఉంటూ వచ్చాను. ఇన్నాళ్లు ఓపిక ఉండడంతో నేను వాళ్లకి పెద్ద భారమనిపించలేదు. కానీ ఈమధ్యన జ్వరం పడి లేచిన తరువాత నా కాళ్లు పూర్తిగా చచ్చుబడిపోయాయి. మేం చెయ్యలేమంటే మేం చెయ్యలేమని విసుక్కుంటూ ఉండడం నాకు తెలుసు గానీ మరీ ఇంత పని చేస్తారనుకోలేదు. విరిగిపోయిన ఫర్నిచర్‌లా విసిరి పారేశారు. నేను వాళ్లకి టైమ్ సెన్స్ నేర్పి, ఒక్క క్షణం కూడా వేస్ట్ చేయకూడదని చెప్పిన మాట నిజమేగానీ ఇలా ముసలి తల్లికి సేవ చేయడం కూడా టైమ్ వేస్ట్ అనుకుంటారని తెలియదు నాకు. వాళ్ల అభివృద్ధికి నేనొక అడ్డంకి అయిపోయానులా ఉంది. ఇద్దరూ సంపాదనకి లోటు లేని వాళ్లే కాబట్టి డబ్బు బ్యాగ్‌లో పడేసి నన్ను వదుల్చుకున్నారు. డబ్బు నన్ను ఎంత వరకు ఆదుకుంటుంది. నేనున్న పరిస్థితుల ఆలోచన లేదు వాళ్లకి. కని, పెంచినందుకు వదిలేయకుండా డబ్బు ఇచ్చామని, వాళ్ల మనసుల్ని జోకొట్టుకుంటారు కాబోలు'' ఆవిడ దుఃఖానికి అంతులేదు.

నాకు కన్నీళ్లు ధారగా కారుతున్నాయి. "ఛీ అసలు మనుషులేనా వాళ్లు?'' ఛీదరించుకున్నాను. "అంత సడెన్‌గా వదిలేస్తే మీరెంత బెంబేలు పడతారనైనా ఆలోచించలేదు. కనీసం ఆ డబ్బుతో ఏ ఓల్డేజ్ హోమ్‌లోనైనా జాయిన్ చెయ్యొచ్చు కదా'' ఆవేశంగా అన్నాను.

"అది కూడా టైమ్ వేస్ట్ అనుకుని ఉంటారు తల్లీ నా బిజీ సుపుత్రులు. ప్రతిక్షణం డబ్బుతో తప్ప వాళ్లకి విలువ కట్టడం రాదు. లేకపోతే పెద్దవాడు ఇలా చిన్నతనంలో జరిగినది మర్చిపోతాడా?'' కళ్లు తుడుచుకుంది ఆవిడ.

"ఏమైందండీ?'' అడిగాను.

"అప్పుడు మా పెద్దవాడు పదేళ్ల వాడు. ఢిల్లీలో లోకల్ ట్రైన్‌లో ప్రయాణం చేస్తున్నాము. అప్పటివరకు మా దగ్గరే ఉన్నవాడు ఎలా దిగాడో, ఎప్పుడు దిగాడో ట్రైన్ దిగిపోయాడు. మా స్టాప్ వచ్చి మేం దిగడానికి చూస్తే వాడు కనబడక మా పై ప్రాణాలు పైనే పోయాయి. ఇంక ఆ రష్‌లో పడి అన్ని స్టాప్స్‌లోనూ వెదకడం మొదలెట్టాం. అసలే చిన్న పిల్లల్ని వికలాంగులని చేసి అడుక్కోడానికి ఉపయోగించే గ్యాంగ్ తిరుగుతోందని పోలీసుల హెచ్చరికలు. ఎన్ని మొక్కులు మొక్కానో, పిచ్చిదానిలా గుండెలు బాదుకుని ఎలా గగ్గోలు పెట్టానో దేవుడికే తెలుసు. పొద్దున్న 9 గంటలకి తప్పిపోయిన పిల్లాడు సాయంత్రం 6 గంటలకి దొరికాడు. వాడు ఆ గ్యాంగ్‌కి దొరికాడని, ఇంకొక్క రోజు ఆలస్యం అయితే వాడి కాలో, చెయ్యో తీసేసేవారని, చాలా చాకచక్యంగా విడిపించాల్సి వచ్చిందని పోలీసులు చెపుతుంటే కొయ్యబారిపోయాం. ఆ దెబ్బతో పిల్లాడు స్కూలుకి వెళ్లడానికి కూడా భయపడిపోయాడు. ఇరవై నాలుగు గంటలూ నా కొంగు పట్టుకునే తిరిగేవాడు. ఆ ఏటికి స్కూలు మానిపించి, ఇంట్లోనే అన్నీ చదివించి స్కూల్లో తరువాత వేశాము. చాలా రోజులు నిద్రలో ఆ

విషయం గుర్తొచ్చి లేచి కూర్చునేవాడు. 'అమ్మా మీరెవరూ కనబడకపోతే నాకెంత భయం వేసిందో' అంటుంటే 'ఫరవాలేదమ్మా' అని గుండెలకి హత్తుకుని ఓదార్చేదాన్ని.

నన్ను పూనా నుంచి చిన్నవాడి దగ్గరకి తీసుకెళ్తున్నారనుకున్నాను. వాడు కూడా నన్ను దగ్గరుండి తీసుకెళ్తున్నాడని భ్రమ పడ్డాను. ఇంత దూరం ఎలా వచ్చి పడ్డానో తెలియడం లేదు. నాకు కాళ్లు లేవు రావడానికి, నన్ను ఎవరయినా ఎత్తుకు వచ్చేసే వయసు, నగలు లేవు. డబ్బు ఉందని ఇందాక బట్టలు తీసుకుంటుంటేనే వాటి మడతల్లో దాచిపెట్టినట్లు దొరికింది. ఇది తప్పకుండా నా పిల్లల పనే. బహుశా నేను పెద్దదాన్ని కాబట్టి తప్పిపోయినట్లయినా భయపడననుకున్నారేమో?" విరక్తిగా అనుకుని, నవ్వుకుందావిడ.

ఆ నవ్వు చూస్తే నా మనసు కకావికలైపోయింది. కళ్లు తుడుచుకుని లేచాను. టీవీ పెట్టి భోజనం తెస్తానని లోపలకి వెళ్లాను. ఆవిడకి జాతీయ, అంతర్జాతీయ విషయాల మీద, రాజకీయాల మీద కూడా ఎంతో కమాండ్ ఉందని ఆవిడ మాటల వల్ల నాకర్థమైంది. మెత్తగా చేసిన అన్నంలో మజ్జిగ వేసి కూరలు, పచ్చడి ముందు పెట్టాను. నెమ్మదిగా తిని "నిన్ను కష్టపెడుతున్నానమ్మా" అందావిడ అభిమానంగా.

"ఏం ఫరవాలేదు మీరు విశ్రాంతి తీసుకోండి" అంటూ ప్లేట్ లోపలికి తీసుకువెళ్లాను సింక్‌లో వేయడానికి.

నేను తిరిగి వచ్చేసరికి ఆవిడ మంచం దిగడానికి శతవిధాల ప్రయత్నిస్తూ వెనక్కి పడిపోవడం చూశాను. "ఏం కావాలండీ?" ప్రశ్నించాను.

తప్పు చేసినట్లు తలదించుకుని "బాత్‌రూమ్‌కి పోవాలమ్మా" నెమ్మదిగా అందావిడ. ఆ అవసరం గురించి అడగాలని తట్టనందుకు నన్ను నేను తిట్టుకుంటూ ఆవిడకి బాత్‌రూమ్‌కి వెళ్లడానికి సాయపడ్డాను. ఆవిడ మొహం సిగ్గుతో, అభిమానంతో ఎర్రబడింది. ఆవిడ అలవాట్లన్నీ చక్కగా నీట్‌గా ఉండడం అలవాటున్న మనిషని చెప్తున్నాయి. ఇలా మరొకరి చేత చేయించుకోవడం ఇష్టం లేక, తప్పనిసరై నలిగిపోతోందని గ్రహించాను. 'ముసలితనం ఎంత నరకం ఆదరించే వారు లేకపోతే' అనుకుంటూ ఆవిడ్ని మంచం పైకి చేర్చాను.

సాయంత్రం ఆయన వచ్చాక అన్ని విషయాలు వివరించి చెప్పాను. ఆయన మొహంలో ఆశ్చర్యం, బాధ, సానుభూతి ముప్పిరిగొన్నాయి.

"మనవి మధ్య తరగతి బ్రతుకులు. మనం ఎంతవరకు ఆవిడకి సాయపడగలం. ఆవిడ దగ్గర డబ్బు ఉందంటోంది గానీ దాన్ని మనం ఉపయోగించగలమా? పోనీ ఉపయోగించినా ప్రాక్టికల్‌గా ఎన్నో ప్రాబ్లెమ్స్ ఎదురవ్వచ్చు. రేపుమన వాళ్లెవరైనా రావచ్చు. అప్పుడు ఎలా కుదురుతుంది ఈవిడకి చేయడం? ఓల్డేజ్ హోమ్‌లోనే జాయిన్ చేస్తే మంచిది" ఇలా రాత్రంతా నేనూ, ఆయన తర్జనభర్జనలు పడుతూనే ఉన్నాం.

మర్నాడు ప్రొద్దుటే ఆవిడ మమ్మల్నిద్దర్నీ దగ్గరికి పిలిచింది. "నేను ఉండడం మీకిబ్బంది కదమ్మా" అంటూ మొదలెట్టింది.

"మీవాళ్ల ఎడ్రస్ ఇస్తే మిమ్మల్ని దింపుతాము" అన్నారాయన.


"వద్దు బాబూ! నన్ను వద్దని వదుల్చుకున్న వాళ్ల దగ్గరికి నేనెందుకు వెళ్లడం. వాళ్ల పేర్లు బయటపెట్టడం నాకిష్టం లేదు కూడాను. నా పెంపకానికీ అవమానం జరిగినట్లు అనిపిస్తోంది. వాళ్లని వాళ్ల వాళ్ల పిల్లలతో హాయిగా బతకనివ్వండి.

"మరి?" మా కళ్లల్లో ప్రశ్నార్థకం.

బ్యాగ్‌లోంచి డబ్బుకట్ట తీసింది. పదివేల వరకూ ఉండొచ్చు. "నన్ను ఏదైనా ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చేర్పించండి బాబూ! దయచేసి భగవంతుడు ఎవర్ని ఎప్పుడు పిలుస్తాడో తెలియదు. అంతవరకు మనం ఈ భూమి మీద ఉండాలి. నాకు ఆ దేవుడు కొండంత గుండె ధైర్యాన్నిచ్చాడు. ఆ హోమ్‌లో నా వయసువాళ్ల మధ్య గడుపుతూ నా మాటల్తో వాళ్లకి స్వాంతన కలిగిస్తూ నేనూ సంతోషం పొందుతాను. నన్నీ రకంగా మీరు ఆదరించకపోతే ఈ డబ్బు నిష్ఫలమైపోయేది. కానీ ఇప్పుడు దీనిని ఆ హోమ్‌కిస్తే నాలాంటి అభాగ్యులను ఆదుకున్నట్లు అవుతుంది" స్థిరంగా పలికిందామె గొంతు.

ఆమె గుండె ధైర్యానికి, ఆత్మవిశ్వాసానికి మేమిద్దరం నివాళులర్పించాం. కొంచెం ఓపిక చిక్కగానే వెళ్లచ్చు అని రెండు రోజులు మా ఇంట్లోనే ఉంచి తర్వాత హోమ్‌లో చేర్పించాం. ఆ రెండు రోజులు సెలవు రోజులవ్వడం వల్ల పిల్లలు ఆవిడ దగ్గర బాగా చేరికైపోయారు 'పెద్దమ్మమ్మ' అనుకుంటూ. సెలవులున్నాయంటే ఏవో ఒకటి నములుతూ నోరాడించాల్సిందే ఇద్దరూను. "అమ్మా! కరకరలాడేదేమైనా పెట్టు" డిమాండ్ చేశారు. "అబ్బబ్బ! ఏం చంపుతున్నార్రా కరకరలాడేవి కావాలి ఇప్పుడు మళ్లీ. నన్ను తినెయ్యండి. గొడవొదిలిపోతుంది." విసుక్కున్నాను.

"నువ్వు కరకరలాడవు మరి" అంది మా సిసింద్రీ.




"అవునే కరకరలాడేలా ఉంటే నన్ను కూడా తినేస్తారు మీరు" అన్నాను నవ్వు దాచుకుని ఆ మాటకి.

"ఇలా రండమ్మా అమ్మని విసిగించకూడదు నేను కథ చెప్తానిలా రండి" పిలిచిందావిడ.

"సరే పెద్దమ్మమ్మా!" అంటూ ఆవిడ మంచం దగ్గరికి స్టూల్స్ లాక్కుని తయారైపోయారు వీళ్లు.

ఇప్పుడు ఊరుకున్నా మళ్లీ కాసేపటికి మొదలెడతారు. కాస్త పిండి తడిపి నాలుగు జంతికలు తెప్పిస్తే సరి అనుకుని లేచాను.

ఆవిడ కథ చెప్పే విధానం నచ్చి నేను పని చేసుకుంటూనే వాళ్లని గమనిస్తూ ఓ చెవి అటువేపు వేశాను.

"మీరు హోమ్‌వర్క్ చేసుకోవాలేమో కదమ్మా" అన్న ఆవిడ మాటకి "ఎప్పుడో చేసేశాం, రేపటిక్కావల్సినవన్నీ చదివేశాం" ధీమాగా చెప్పేశారు వీళ్లు. సరేనంటూ ఆవిడ 'గుడ్ సమారిటన్' కథ చెప్పింది.

"గాయాలు తగిలి మూలుగుతున్న బాటసారి మీద గుర్రంపై వెళ్తున్న ఒక మతగురువు డబ్బుసంచీ విసిరి వెళ్లిపోయాడనీ, ఒక మంచి వాడు అతని గాయాలకు మందుపూసి సేవచేశాడని చెప్పింది. చూశారమ్మా దెబ్బలు తగిలి లేవలేని మనిషికి డబ్బు ఇస్తే ఏం చేసుకుంటాడు? వాడికి ఎవరూ లేనిచోట ఆ డబ్బుతో ఏం ఉపయోగం? ఆ మంచి వాడు సాయం చేయకపోతే అతను అక్కడే చచ్చిపోయేవాడు అవునా?" అందావిడ.

"అవును పెద్దమ్మమ్మా అవును. సాయం చేసినవాడే గొప్పవాడు" అన్నారు పిల్లలిద్దరూ కోరస్‌గా.

"మీ అమ్మ కూడా నాకలాంటి సాయమే చేసిందమ్మా" అందావిడ నావేపు తిరిగి చేతులు జోడిస్తూ.

"అయ్యో! అదేంటండీ?" అన్నాను నేను కంగారుగా.

"తప్పు పెద్దమ్మమ్మా! పెద్దవాళ్లు చిన్నవాళ్లకి దణ్ణం పెట్టకూడదు" ఆవిడ చేతులు విడదీశారు పిల్లలు.

"అవునమ్మా అవును" ఆవిడ వాళ్ల తలమీద చేతులు వేసి నిమిరింది అభిమానంగా.

మర్నాడు అన్నీ వివరంగా కనుక్కుని హోమ్‌లో జాయిన్ చేశాం. మేమావిడని, ఆవిడ మమ్మల్ని వదలడం కష్టమయిపోయింది. ప్రతి సండే పెద్దమ్మమ్మని చూడ్డానికి వద్దామని పిల్లలకు నచ్చజెప్పాల్సి వచ్చింది. ఆవిడ కాళ్లు పనిచేయడం లేదు కాబట్టి జాగ్రత్తగా అటెండ్ అవ్వాలని చెప్పి చెప్పి అప్పజెప్పాం.

మేము కనుమరుగయ్యేంత వరకూ ఆవిడ చెయ్యి ఊపుతూనే ఉంది. ఆటోలో కూర్చుని ఆగకుండా పొంగుతున్న కన్నీళ్లను తుడుచుకున్నాను. 'ఇదేమి వింత అనుబంధమో?' అనుకుంటూ.

(రక్తసంబంధం అన్ని బంధాల కన్నా ఎక్కువన్న భావనతో బ్లడ్ ఈజ్ థిక్కర్ దేన్ వాటర్ అంటారు. కానీ ఇలాంటి సంఘటనలు మనకు 'ఈజ్ బ్లడ్ థిక్కర్ దేన్ వాటర్?' అన్న ప్రశ్నను మిగులుస్తున్నాయి.)